

నేనావత్ శంకర్ వలస వెళ్లడంతో ఇంటికి దర్శనమిస్తున్న తాళం

నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
హైదరాబాద్, బుధవారం 26 మార్చి 2025 | RANGAREDDY

## కేసీఆర్ హయాంలోనే రైతులకు మేలు జరిగింది..



కేసీఆర్ హయాంలోనే రైతులకు మేలు జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో పాటు రైతుభరోసా అందించక.. పంట రుణాలను మాఫీ చేయకపోవడంతో చాలామంది గిరిజనులు ఆర్థిక ఇబ్బందులు తాళలేక.. అప్పులను తీర్చే మార్గం లేక మహారాష్ట్రలోని పుణె, హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఉపాధి లేని కారణంగానే వలసలు పెరిగాయి. బిందెంగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బిందెంగడ్డతండా, చింతల్‌కుంటతండా నుంచి సుమారు 50కి పైగానే కుటుంబాలు వలస వెళ్లాయి.

**- తుల్జానాయక్, బిందెంగడ్డతండా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, కులకచర్ల**

## జీవనోపాధి కోసమే పుణెకు..



భర్త మరణించి ఐదేండ్లు దాటింది. ఒక కుమారుడు ఉన్నాడు. ఊరిలో గుంట భూమి కూడా లేదు. తినేందుకు తిండి లేక.. ఉండేందుకు ఇల్లు లేక బతుకుదెరువు కోసం మహారాష్ట్రలోని పుణెకు వెళ్తున్నా. కొడుకును ఇంటర్ వరకు చదివించా. ఉన్న ఇల్లు కూలి పోయింది. కట్టుకునే స్థోమత కూడా లేదు. పుణె నుంచి తిరిగి గ్రామానికి వచ్చినప్పుడు ఇంట్లో మంచిగా ఉన్న కొద్దిపాటి స్థలంలోనే ఉంటున్నాం. ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఇల్లు రాలేదు.

**-జరుప్ల బుజ్జిబాయి, వలస కూలీ, బిందెంగడ్డతండా, కులకచర్ల**

# ఊర్లకు ఊర్లు ఖాళీ

## కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలైన వలసలు

- బతుకుదెరువు కోసం వలస వెళ్తున్న వికారాబాద్ జిల్లావాసులు
- కులకచర్ల మండలంలోని పలు తండాల నుంచి వందలాది కుటుంబాలు..
- సన్నగిల్లిన ఉపాధి అవకాశాలు
- నిర్మానుష్యంగా కనిపిస్తున్న పరిగి, కొడంగల్ సెగ్మెంట్లలోని తండాలు, గ్రామాలు
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో వలసలు బంద్
- కేసీఆర్ తీసుకున్న సంస్కరణలతో స్వగ్రామాల్లోనే ఉపాధి పొందిన ప్రజలు



గిరిజనులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో నిర్మానుష్యంగా మారిన బిందెంగడ్డతండా

వికారాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సబ్బండ వర్గాలకు కష్టాలు మొదలయ్యాయి. అలవికాని హామీలిచ్చి గద్దెనెక్కిన పాలకులు అన్ని వర్గాలను నట్టేట ముంచుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధి కోసం జిల్లాలోని పరిగి, కొడంగల్ నియోజకవర్గాల ప్రజలు దుబాయ్, ముంబై, పుణె, హైదరాబాద్‌లకు వెళ్లిన పరిస్థితులు ఉండేవి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై.. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి, ఉపాధి కల్పన కార్యక్రమాలను అమలు చేయడంతో వలస వెళ్లిన ప్రజలు తిరిగి తమ సొంతూళ్లకు చేరుకున్నారు. పదేండ్లపాటు ఎలాంటి ఢోకా లేకుండా స్థానికంగానే ఉపాధి పొందుతూ కుటుంబాలతో సంతోషంగా జీవించారు.

కాగా.. 15 నెలల కిందట కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఉపాధి అవకాశాలు సన్నగిల్లి మళ్లీ వలసబాట పడుతున్నారు. కేసీఆర్ హయాంలో పంటల సాగుకు పెట్టుబడి సాయాన్ని అందించడం మొదలుకొని పండించిన పంటనూ కొనుగోలు చేసి రైతుకు మద్దతు ధర ఇవ్వడం.. స్వయం ఉపాధి అవకాశాలతోపాటు సబ్సిడీ రుణాలు అందించడం, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యమిచ్చారు.

అయితే, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనంతరం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీని కూడా సక్రమంగా అమలు చేయడంలేదు. బీఆర్ఎస్ హయాంలో వలసలు ఆగిపోయి సొంతూళ్లలో వ్యవసాయం, స్వయం ఉపాధి పొందితే, రేవంత్ సర్కార్ 15 నెలల పాలనలోనే ఊర్లకు ఊర్లు ఖాళీ అవుతున్నాయి. పంటల సాగుకు చేసిన అప్పులు కూడా తీర్చలేక ఇంటిల్లిపాది పల్లెలను వదిలి ఉపాధి కోసం ముంబై, పుణె, హైదరాబాద్‌కు మూటాముల్లె సర్దుకొని వలస వెళ్తున్నారు.

గత సీఎం కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సాగునీరు తీసుకొచ్చి వలసలను శాశ్వతంగా దూరం చేయడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తే.. రేవంత్ సర్కార్ మాత్రం అన్ని వర్గాలకు అన్యాయం చేస్తున్నది. ఫార్మా కంపెనీలతోపాటు పలు పరిశ్రమల ఏర్పాటు కోసం ఎకరం, రెండెకరాల భూములు ఉన్న అన్నదాతల నుంచి బలవంతంగా పొలాలను లాక్కుంటుండడంతో రైతులు, ప్రజలు వలసబాట పడుతున్నారు. పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని తండాలకు చెందిన వందలాది కుటుంబాలు తమ ఊర్లను వదిలి ఉపాధి కోసం ముంబై, పుణె, హైదరాబాద్‌కు వలస వెళ్లారు. పరిగి సెగ్మెంట్ కులకచర్ల మండలంలోని పలు తండాల్లో చాలా ఇండ్లు జనాల్లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. బిందెంగడ్డతండా, చింతల్‌కుంట తండా తదితర తండాల్లో ఏ ఇంటిని చూసినా తాళాలే కనిపిస్తున్నాయి. కొందరు ఇండ్లకు తాళాలు వేసి పిల్లాజెల్లలతో కలిసి వలస వెళ్తే.. మరికొందరు ఇండ్ల వద్ద వృద్ధులను వదిలేసి వెళ్లడంతో.. తినడానికి సరిపడా ఆహారం అందక.. పింఛన్ డబ్బులతో ఒక పూట తింటూ మరో పూట పస్తులుంటూ తమ కుటుంబ సభ్యులు ఎప్పుడొస్తారో అని వెయ్యి కండ్లతో ఎదురుచూస్తున్న దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. కులకచర్ల, దోమ, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని పలు తండాల్లో వందలాది కుటుంబాలు వలస వెళ్లాయి.

### అప్పులు తీర్చలేని పరిస్థితి ఉన్నది..



మా కుటుంబంలో ఏడుగురు అన్నదమ్ములం ఉన్నాం. కేవలం మూడెకరాల భూమి మాత్రమే ఉన్నది. దానిని సాగు చేసేందుకు ఇక్కడే ఉన్నా. మిగిలిన ఆరుగురు అన్నయ్యలు బతుకుదెరువు కోసం పుణెకు వలసవెళ్లారు. అప్పులు తీసుకొచ్చి ఉన్న భూమిలో పంటను సాగు చేసినా దిగుబడి రాలేదు. తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు. రైతుభరోసా పెట్టుబడి సాయం సమయానికి వచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది. చాలాకష్టంగా జీవిస్తున్నా. మిగిలిన కుటుంబ సభ్యులు పండుగల సమయంలో ఇక్కడికి వస్తారు. ఇల్లు చాలా చిన్నగా ఉండడంతో అందరూ ఉండలేని పరిస్థితి.

**-జరుప్త సంతోష్, బిందెంగడ్డతండా, కులకచర్ల**

### కుటుంబాలను పోషించుకునేందుకే..



మా గ్రామంలోని చాలామంది గిరిజనులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. అందుకు కారణం ఇక్కడ ఉపాధి లేకపోవడమే. గ్రామంలో పని దొరకక, కుటుంబాలను షోషించుకునేందుకే వలస వెళ్తున్నారు. ఇక్కడ ఇప్పటికీ ఉమ్మడి కుటుంబాలున్నాయి. అందరూ గ్రామంలోనే ఉండాలంటే పని దొరకడం లేదు.

**- శ్రీనూనాయక్, బిందెంగడ్డతండా, కులకచర్ల**

### అప్పులు తీర్చేందుకు కొడుకులు పూణె వెళ్లారు.

రెండెకరాల పొలం ఉన్నది. నలుగురు కుమారులున్నారు. ఉండేందుకు బండల ఇల్లు మాత్రమే ఉన్నది. ఉన్న పొలంలో పంటను అప్పులు తీసుకొచ్చి సాగు చేశా. ప్రస్తుతం ఆ అప్పులు తీర్చలేని పరిస్థితి నెలకొన్నది. కేసీఆర్ హయాంలో రైతుబంధు పెట్టుబడి సాయం సక్రమంగా అందడంతో పంటల సాగుకు అప్పులు తీసుకొచ్చే పరిస్థితి రాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సాయం సక్రమంగా రాక అప్పులు చేయాల్సి వస్తున్నది. చేసిన అప్పులను తీర్చేందుకు నా కొడుకులు, కోడళ్లు పూణెకు బతుకుదెరువు కోసం వెళ్లారు. వారి పిల్లలను పెంచుతూ భర్త నేను గ్రామంలోనే ఉంటున్నా.

**-నేనావత్ సోనమ్మ, బిందెంగడ్డతండా, కులకచర్ల**



పుణెకు వలస వెళ్లడంతో తాళం వేసిన ఉన్న నేనావత్ కిషన్ ఇల్లు



## దాహం తీర్చండి మహాప్రభో..

దాహం తీర్చండి మహాప్రభో.. అంటూ మహిళలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.. మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామంలోని ప్రతాప్‌నాగర్‌కాలనీ.. కొర్రతండా గ్రామంలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా సరిగ్గా జరుగక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు రోజులకొకసారి మిషన్ భగీరథ నీరు వస్తుండడంతో వాడుకునేందుకు కూడా నీళ్లు లేక అవస్థలు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఖాళీ బిందెలతో వారు నిరసన తెలిపారు. స్థానికంగా ఉన్న చేతిపంపులు చెడిపోవడంతో నీటి కష్టాలను వర్ణించలేమని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి తాగునీరు ప్రతిరోజూ వచ్చేలా చూడడంతోపాటు చేతిపంపులకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**-మాడ్గుల, మార్చి 25**



## కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ అధినేతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం
- బండి సంజయ్‌ను హెచ్చరించిన బీఆర్ఎస్ శ్రేణులు

ఇబ్రహీంపట్నం, మార్చి 25 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఇబ్రహీంపట్నం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. అనంతరం మాట్లాడుతూ..అసాధ్య మనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సుసాధ్యం చేసిన కేసీఆర్‌పై బండి సంజయ్ నిరాధార ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై కేసు నమోదు చేసి.. ఆయన మంత్రి పదవిని, పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని స్పీకర్ కార్యాలయాన్ని కోరుతున్నామన్నారు. అదేవిధంగా మరోసారి ఆయన కేసీఆర్ కుటుంబంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాగా, బండి వ్యాఖ్యలను నిరసిస్తూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లోని పలు ఠాణాల్లో బీఆర్ఎస్ శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మంగ ఐలేశ్, కరుణాకర్, గరిగె శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




బండి సంజయ్‌పై ఇబ్రహీంపట్నం ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్వీ శ్రేణులు

# నాడు అద్భుతం..నేడు అధ్వానం..

- బీఆర్ఎస్ హయాంలో 'పల్లెప్రగతి'తో ఆదర్శ గ్రామంగా నిలిచిన కక్కులూరు
- పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్..అస్తవ్యస్తంగా మారిన పరిసరాలు

ఎట్లుండె పల్లె ఎట్లాయె

షాబాద్, మార్చి 25 : మారుమూల పల్లెలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి గ్రామానికీ ఒక వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, హరితహారం నర్సరీ, తెలంగాణ క్రీడా ప్రాంగణం, కంపోస్ట్ యార్డు, రైతువేదిక, చెత్త సేకరణకు ట్రాక్టర్ తదితరాలతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దింది. పదేండ్లపాటు ఎటు చూసినా పచ్చదనంతో అలరారిన గ్రామాలన్నీ.. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో పూర్తి అధ్వానంగా తయారయ్యాయి. ఇందుకు సాక్ష్యం మండలంలోని కక్కులూర్ గ్రామం. ఈ ఊరు 'పల్లెప్రగతి'లో ఆదర్శంగా నిలిచింది. స్వచ్ఛతతో ముందున్నది. కంపోస్ట్ యార్డు, పల్లెప్రకృతివనం, పారిశుధ్యం తదితర వాటిలో అందరితో శభాష్ అనిపించుకున్నది. కాగా, ప్రస్తుతం పల్లెప్రగతిలో చేపట్టిన ఏ ఒక్క దానినీ కాంగ్రెస్ సర్కార్, సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది.

### నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు

కేసీఆర్ హయాంలో పచ్చని మొక్కలతో కళకళలాడిన పల్లెప్రకృతి వనంలోని మొక్కలు.. ప్రస్తుతం సరిపడా నీరందక ఎండిపోతున్నాయి. కంపోస్ట్ యార్డు కూడా ఎండిపోయిన మొక్కల మధ్య వెలవెలబోతున్నది. వైకుంఠధామంలో స్నానాలు చేసే గదుల ఆవరణలో పిచ్చిమొక్కలు మొలవడంతో అక్కడ అడవిని తలపిస్తున్నది. ముంబై-బెంగళూరు లింకు జాతీయ రహదారి పక్కనే ఉన్న రైతువేదిక పచ్చని మొక్కల మధ్య కళకళలాడుతూ చూపరులను ఆకట్టుకునేది. ఇప్పుడు ఆ మొక్కలకు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. గ్రామంలోని మురుగుకాల్వలు ఏరులై పారుతున్నాయి. గత 14 నెలలుగా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడం, ప్రస్తుత ప్రభుత్వం గ్రామాలను పట్టించుకోకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





నాడు..కక్కులూర్‌లో వైకుంఠధామం వద్ద కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన స్నానాల గదులు.. నేడు పిచ్చిమొక్కలతో ఇలా..



పల్లెప్రకృతివనంలో నీళ్లు లేక ఎండిపోయిన మొక్కలు



కక్కులూర్‌లో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం

నాడు.. కేసీఆర్ ప్రభుత్వంలో కక్కులూర్‌లోని కంపోస్టు షెడ్ పరిసరాల్లో ఏపుగా పెరిగిన పచ్చని మొక్కలు... నేడు నీళ్లు లేక ఎండిపోయి కళావిహీనంగా ఇలా..